# అమెరికా రాజయ్య

డాక్టర్ నక్కా విజయరామరాజు

''ఓ రామయ్యో! ఓ మా అయ్యో!

''ఓ సీతమ్మో! ఓ మాయమ్మో! ఆఁ! ఊఁ!''

అంటూ రాగయుక్తంగా పాట పాడుతూ పైడివ్వ చెరువులో బట్టలుతుకుతున్నాడు రాజయ్య. బట్టలుతుకుతున్నప్పుడు అలా ఏదోక పాట పాడవలసిందే. రాజయ్య గొంతులో పాట ఆయన తీసే రాగాలు కూడా బాగుంటాయి. ఆ పాటల్లోనే పని భారం మరిచిపోతాడాయన.



## భట్టిప్రోలు కథలు

చెరువు కట్ట మీదున్న పైడిమ్మ గుడి ఎదురుగ్గా దేవరచింతచెట్టు నీడన ఈత చువ్వల్తో బుట్టలల్లుతున్నాడు ఎరికల బొట్టుమీద కురుపోడు. చెరువుకి పడమర వైపున కేరింతలు కొడుతూ ఈతలేస్తున్నారు గొడ్ల కాడ బుడ్డోళ్లు. కొంతమంది కలువ పూల కోసం చెరువు మధ్యలో ఉన్న స్తంభం దగ్గరకీదుకుంటూ పోతున్నారు.

రాజయ్య బట్టలుతికి పిండి ఒడ్డు మీద వేస్తుంటే అతని భార్య రత్తమ్మ వాటన్నింటినీ చెరువు కట్ట మీద ఎండేస్తోంది.

చాకిరేవులో రాజయ్యతో పాటు పాతికమంది దాకా బట్టలుతుకుతూ ఏదొక పాటో, కూనిరాగమో.. పాడుతూనే వున్నారు. ఊరంతటికి చాకిరేవు పైడిమ్మ చెరువే. ఆ చెరువు కట్ట దిగువనే చాకలి పాలెం.

చాకిరేవులో నిద్రగన్నేరు చెట్టు కిందున్న బండ రాజయ్యది. అది ఆయన తాత సుబ్బయ్య నుంచి వారసత్వంగా తండ్రికి, తర్వాత రాజయ్యకి వచ్చింది. చివరి బట్ట ఉతికి జాడించి ఒడ్డుకెక్కాడు రాజయ్య. కాళ్ల వేళ్ల మధ్యలో వున్న చర్మమంతా పాచిపట్టి ఉబ్బి వుంది. కట్ట మీదున్న బావి దగ్గర బొక్కెనతో నీళ్లు చేది కాళ్లు, చేతులు కడుక్కుని చెట్టుకిందకొచ్చి కూర్చున్నాడు. అప్పటికి అక్కడ పున్నీళ్ల కుండతో సత్తుగిన్నెలతో సిద్ధంగా వుంది రత్తమ్మ. ఓ సత్తు గిన్నెలో సద్దన్నం ఏసి అంచుల దాకా పున్నీళ్లు పోసి చేతికొక ఉల్లిగడ్డ ఇచ్చింది. పున్నీళ్లు గటగటా తాగేసి సద్దనం తిన్నాడు ఉల్లిగడ్డ నంజుకుంటూ. నోరు పుక్కిలించి ఊసి... చుట్టముట్టించి చెట్టు మానుకి చేరగిలపడ్డాడు రాజయ్య. అక్కడంతా చల్లగా వుంది. ఎన్ని తరాలుగా ఎంతమందికి నీడనిస్తుందో ఆ మాను. అప్పటిదాకా రేవులో బట్టలుతికినోళ్లలో కొంత మంది ఇంకా అన్నాలు తింటుంటే, కొంత మంది బీడీలు తాగుతూ పచ్చీస్, పులిజూదం ఆటలాడుకుంటున్నారు.

''పోతురాజు నిన్నటి నుంచి కనబడలా ఏడకి పోయాడే?'' అడిగాడు చుట్ట నూసిరాలుస్తూ రాజయ్య.

''ఏదో కాగితం కోసరమని సావాసగాళ్లతో కల్సి గుంటూరెల్తానన్నాడు. ఈ పాటికి రావాలే'' చెప్పింది గిన్నెలు సర్దుతూ రత్తమ్మ. చెట్టు మీదొక కాకి అదే పనిగా అరుస్తోంది.

''ఎవురింటికన్నా చుట్టాలొత్తారేమో'' అనుకుంటూ పైకనేశాడు రాజయ్య.

''చుట్టాలు కాదు ఉత్తరం వచ్చింది రాజయ్యా'' అంటూ పోతురాజు పేరు మీద ఒక గోధుమ రంగు కవరిచ్చెళ్లాడు పోస్టుమాన్ యాదవరాజులు. పోతురాజుతో చదివిచ్చుకోవచ్చులే అని దాన్ని ముందు వెనుక చూసి జుబ్బాజేబులో దోపుకున్నాడు రాజయ్య.

రాజయ్య ఐదవ తరగతి దాకా చదువు కున్నాడు. కానీ ఇంగ్లీష్ సరిగ్గా అర్థం కాదు. పేపరైతే కింది నుంచి పైదాకా చదివేస్తాడు. చాకలిపాలెంలో పేపరు చదివి అందరికీ మంచి చెడూ చెప్పేది ఆయనే.

ఆరేసిన బట్టలు కళాఫెళా ఆరిపోయినయి. ఆడోళ్లంతా బట్టలు మడతలేస్తుంటే.... మగాళ్లు మూటలు కడుతున్నారు. పొద్దు పడమటికి వాలింది. అప్పటిదాకా చెరువులో పడుకున్న గొడ్లు ఇళ్లకు బయల్దేరినాయి. దీపాలు పెట్టే వేళ దాకా చూసినా పోతురాజు రాలేదు. ఆగలేక ఉత్తరం తీసుకుని రాజయ్య కరణంగారింటికి వెళ్లాడు.

''ఈ ఉత్తరం ముక్క గూసింత సదివిపెట్టండి'' అంటూ కవర్‌ను కరణంగారి చేతికిచ్చాడు రాజయ్య.

దాన్ని ట్యూబ్‌లైట్ వెలుతురులో ఎగాదిగా చూసి ఇదేదో గవర్నమెంట్నుంచి వచ్చిన ఉత్తరంగా వుందే అంటూ చింపి ఉత్తరం చదివి 'ఇంత మంచి వార్త అంత మెల్లిగా చెబుతావేరా? ఏమే... నిన్నే వినపడిందా... కొంచెం పంచదార పట్రా చాకలి రాజయ్య నోరు తీపిచెయ్యాలి' అంటూ ఇంట్లోకి చూస్తూ కేకేశాడు కరణంగారు.

ఏమీ అర్థం కాక బిత్తరపోయి చూస్తున్నాడు రాజయ్య.

''మీ పోతురాజుకి గుంటూరులో డాక్టరు సీటు వచ్చిందిరా... వచ్చి చేరమని ఈ ఉత్తరం. గట్టోడే మన పోతురాజు. మన ఊరికి మొదటి ఎంబిబిఎస్ డాక్టరు మీ వాడే'' అంటూ ఉత్తరాన్ని మరోసారి చదివి, పంచదారను రాజయ్య నోట్లో పోసాడు కరణంగారు.

రాజయ్యకి అంతా అయోమయంగా, ఆనందంగా గజిబిజిగా వుంది. కరణంగారికి దండం పెట్టి ఇంటికి బయలుదేరాడు రాజయ్య. 'అంటే, తన కొడుకు చదివిన సదువుకి డాక్టర్ సీటొచ్చిందన్న మాట. ఊరి మొత్తంలో ఆడికొక్కడికే వచ్చిందంటే ఆడు నిజంగా తెలివైనవాడే! ఆలోచనల్లో వుండగానే ఆయన కాళ్లు సారా బావయ్య కొట్టు దగ్గరకి లాక్కెళ్లినయి. అక్కడ రాజయ్య సావాసగాళ్లు నాలుగైదుగురున్నారు. రెండు డ్రాములేసుకొని వారిక్కూడా తలొక డ్రాము వేయించాడు. రాజయ్య ఇల్లు చేరేసరికి ఇంటి ముందు కులపోళ్లంతా గుమిగూడారు. అప్పటికే ఒక్కొక్కళ్లు రెండు మూడు ముంతల కల్లు తాగున్నారు.

''నిజమేనా! మనోడు... మన పోతురాజు డాకటేరంటగా. చెప్పు మామా?'' అంటూ అడిగాడు నారాయణ రాజయ్య భుజాలు పట్టి ఊపుతూ..

''ఊఁ! అవున్రా... గుంటూరు నుంచి ఉత్తరం వచ్చింది. దాన్ని చదివి కరణంగోరు చెప్పారు'' అన్నాడు ముద్దముద్దగా.

''మెల్లిగా సెబుతావేంటి? గట్టిగా సెప్పు. ఊరంతా ఇనబడేట్టు చుట్టుపక్కల పదహారు ఊర్లలో గింగిరీలు తిరిగేట్టు సెప్పు మామా! మనోడు ఈ తాలూకాకే గొప్ప కదూ! అంటూ.... మన కులంలో డాక్టరీ అంటే మాటలా? మజాకా?'' అంటూ కల్లు ముంత రాజయ్యకు అందించాడు సాంబయ్య. కల్లు కుండలు రెండు ఖాళీ అయిపోయినాయి.

రాజయ్య పాట పాడుతుంటే అంతా కలిసి వంతపాడారు. తాగి తందనాలాడారు. బిందె, మట్టి కుండ, పళ్లెం, చేట, సాకలి బాణా... ఏది దొరికితే దాని మీద దరువులేశారు. వారి తందనాలయిపోయి ఎవరిళ్లకు వారు పోయేసరికి మలికోడి కూసింది.

* * *

''యవ్వారం సూత్తా వుంటే రేవుకొచ్చేలా లేదే? బారెడు పొద్దెక్కింది. దొరగారు ఇంకన్నా లేత్తారా?'' అంటూ లేపింది రత్తమ్మ.

''మనోడు డాకటేరు..ఇంకా సాకిరేవు దేనికే? ఇస్త్రీ పెట్టె దేనికే... లచ్చులు, కోట్లు... మేడలు, మిద్దెలు... హ్హా...హ్హా...హ్హా... నేను రాజుని, నువ్వు రాణివే. మనల్ని ఏడంతస్థుల మేడలో పెడతాడే నా కొడుకు పోతురాజు. తాలూకా మొత్తానికే మన కులంలో ఆడొక్కడే డాకటేరు'' అంటూ నవ్వుతూ లేశాడు రాజయ్య.

''రాత్తిరి తాగిందింకా దిగినట్లు లేదు'' అంటూ తిట్టుకుంది రత్తమ్మ.

''అబ్బాయేడే.. నిన్నటంగా పోయినోడింకా రాలేదు'' అని పొంతకుండతో నీళ్లు పుక్కిలించి ఊస్తూ అడిగాడు రాజయ్య.

ఆ రోజంతా చాకలిపాలెం సారాలో మునిగి పోయింది.

రాజయ్య ఇరుగు పొరుగే కాదు... చుట్టుపక్కల ఊర్ల నుంచి కూడా స్నేహితులు, బంధువులు రాసాగారు. పోతురాజును ఆకాశానికెత్తేశారు. చుట్టుపక్కల ఊర్లన్నింటిలో పోతురాజే మొదటి డాక్టరు మరి!

రాజయ్య సడెన్‌గా కులంలో పెద్దమనిషయి పోయాడు. ఊళ్లో కూడా ఇదివరకటిలాగా చాకలి రాజయ్య అని పిలవడం లేదు. అంగలకుదురు రాజయ్యంటూ గౌరవంగా పిలుస్తున్నారు.

పోతురాజు గుంటూరు మెడికల్ కాలేజీలో జేరిన దగ్గర్నుంచి అతని గురించే ఆలోచించేవాడు రాజయ్య. హాస్పిటల్ రేపల్లెలో పెడితే బాగుంటదా? తెనాలిలోనా? చెరుకుపల్లిలోనా? అని దినమంతా అదే పని, కరణంగార్ని, మున్సబ్‌గార్ని, డాక్టర్ నల్లచారి గార్ని సలహా అడిగేవాడు. ఎవరితో ఏమి మాట్లాడినా పోతురాజు గురించే. ధూళిపూడిలో పద్మసాలీలబ్బాయికి కూడా డాక్టర్ సీటొచ్చిందంటే పోయి పలకరించి వచ్చాడు రాజయ్య.

రత్తమ్మ ఇల్లిల్లు తిరిగి బట్టలు తెచ్చి చాకిరేవులో పడేస్తే శుభ్రంగా ఉతికి జాడించేవాడు. వాటన్నింటినీ ఆరేసి మడతలు పెట్టి మూటలు కట్టేది రత్తమ్మ. ఎవరివి వాళ్లకిచ్చి వాళ్లిచ్చే అన్నాలు, కూరలు తెచ్చేది. ఇద్దరు తినంగా మిగిలిన అన్నంలో పున్నీళ్లు పోసి పొద్దున్న తాగేవాళ్లు.

పండుగలకు, పబ్బాలకు బూరెలు, గారెలు పెట్టేవాళ్లు. నాయుళ్లు వడ్లు కొలిస్తే, కోమట్లు బ్రాహ్మల ఇళ్లల్లో సంవత్సరానికింత అని డబ్బులిచ్చేవాళ్లు. రాజయ్యకు ఇస్త్రీ పెట్టె మీద పావలో బేడో దొరికేది. రోజంతా బట్టలుతికి మాపిటేల ఇస్త్రీ చేసి రాజయ్యకు సాయంత్రానికి డ్రాము సారా పడితే గాని ఒళ్లు నొప్పులు తగ్గేవి కాదు. రాజయ్యకు చాకిరేవులో బండ వుంటే, రత్తమ్మకి బాడవలో ఎకరం పొలం వుంది. అది ఆమె తాత నుంచి వచ్చింది. మడేలు రంగయ్య ఊరికొలువులకు, పండుగలకు, రథం ఊరేగింపులో కాగడాలు మోసినందుకు అప్పటి జమీందారిచ్చిన పొలం అది. సాలుకి పది, పదిహేను బస్తాల వడ్లు పండేవి. దాన్ని కట్టమీద

సాంబయ్య కౌలు చేసేవాడు.

* * *

రెండో సంవత్సరం చదువుతుండగా ఒకసారి ఇంటికొచ్చిన పోతురాజు రెండు మూడు రోజులైనా కాలేజీకి పోలేదు.

''ఏమైందిరా శెలవలా?'' అనడిగాడు రాజయ్య.

''హాస్టల్లో మెస్ బిల్లు కట్టాలి. కాలేజీలో ఫీజు కట్టాలని'' చెప్పాడు. ఎంతవుతుందో పోతురాజు చెప్పేసరికి గుడ్లు తేలేశాడు రాజయ్య. 'అంత డబ్బు మనకాడెక్కడిదిరా? మనబోటోళ్లకు అదేదో స్కాలర్‌షిప్ గవర్నమెంటోళ్లు ఇత్తారంటగా' అడిగాడు రాజయ్య.

''సంవత్సరం చివర్లో ఇస్తారు. ముందస్తుగా మనం ఫీజులు కట్టాల్సిందే. కాలేజీలో అందరూ అంతే! లేకపోతే ఇంటికెళ్లి పొమ్మన్నారు'' చెప్పాడు పోతురాజు.

కరణం గారి నుంచి కోమటి రంగయ్య, పెద్దకాపు రామయ్య దాకా అందరిళ్లకు తిరిగాడు. ఎక్కడా పైసా పుట్టకపోగా... 'మీలాంటోళ్లకు అంత పెద్ద సదువులెందుకురా? ముందే సెప్పలా...తలకు మించిన భారం ఎత్తుకుంటున్నావని' అన్నారు కొంతమంది.

ఇంటిముందున్న వేపచెట్టు కింద నులక మంచం వాల్చుకొని దిగాలుగా కూర్చున్నాడు రాజయ్య చుట్ట పొగ వదుల్తూ . మంచంలో ఊర్లో ఇవ్వాల్సిన బట్టలు మడతలేస్తోంది రత్తమ్మ. ఇస్త్రీ పెట్టెలో బొగ్గులు రాజేస్తున్నాడు పోతురాజు. అప్పుడొచ్చాడు కాయిదా బేరగాడు తుంపులయ్య సిగరెట్టు పీలుస్తూ... అతను రాగానే గుప్పుమని అత్తరు వాసన పరుచుకుంది. అతనే వెళ్లి కొబ్బరిచెట్టు కానిచ్చి వున్న నులకమంచం తెచ్చుకుని రాజయ్య ముందేసుకొని కూర్చున్నాడు.

చుట్టూ కలియజూసి రాజయ్య ముఖంలోకి ఎగాదిగా చూసి, 'ఏదో సామెత చెప్పినట్లు... కొడుకు డాకటరైతే ఖుషీ చేయాల్సింది పోగా... దిగాలుగా కూసున్నాడేంటి బావా' అని ఇంకో సిగరెట్టు ముట్టించాడు తుంపులయ్య.

''పోయినేడాదే తెలిసింది మనోడుకి డాక్టర్ సీటొచ్చిందని, క్షణం తీరికలేదు... దమ్మిడి ఆదాయం లేదన్నట్లు తిరుగుడే.. ఒకచోట కాలు నిలబడితే గందా! ఊర్లో నాయుడిగారింట్లో మైసూరు గిత్తలుంటే.. పెద్దారం ఆసాములు అడిగారు చూద్దామని వచ్చా బావా'' అంటూ ఎద్దుల గురించి మాట్లాడసాగాడు తుంపులయ్య.

తుంపులయ్య రత్తమ్మకు బీరకాయ పీచు బంధువు. గొడ్లు మారకం... ఎద్దుల బేరం...పెళ్లి సంబంధాలు.. ఉద్యోగాలిప్పిస్తానంటూ ఊర్లు పట్టి తిరుగుతుంటాడు.

తుంపులయ్యకి ఇత్తడి గ్లాసులో మంచినీళ్లిచ్చి నిలబడింది రత్తమ్మ. 'పోతురాజు డాకటేరవుతాడో లేడో గానీ మేము పీకల్లోతు బాధల్లో ఉన్నామన్నా.. టయానికి దేవుడల్లే వచ్చావు. నువ్వే మమ్మల్ని ఒడ్డున పడెయ్యాలి' అంటూ ఖాళీ గ్లాసందుకొని పోతురాజు కాలేజీలో, హాస్టల్లో కట్టాల్సిన ఫీజుల గురించి చెప్పింది రత్తమ్మ.

''ఈ కరువు కాలంలో పెద్ద ఏమౌంటే. వెంటనే డబ్బు ఏర్పాటంటే మనతో కాదు... ఇంకేదన్నా మార్గం చూడమంటే చూస్తా... నాకు రెండు, మూడు రోజుల గడువియ్ చెల్లెమ్మ... వత్తా బావా!'' అంటూ లేచాడు తుంపులయ్య. ఇస్త్రీ పెట్టె వేడెక్కింది.

తుంపులయ్య రెండు మూడు రోజుల దాకా పత్తాలేడు. అప్పు కోసం కనగాల, గూడపల్లి వెళ్లొచ్చాడు రాజయ్య. అక్కడా పైసా పుట్టలేదు. నాలుగోరోజు సాయంత్రం ఇంకో మనిషిని వెంటబెట్టుకుని వచ్చాడు తుంపులయ్య. 'ఈయన్ది ఇసుకపల్లె. మనోళ్లే. రేపల్లె క్రిష్ణా టాకీసు దగ్గర రెండు కొట్లు కట్టి ఇస్త్రీ షాపు పెట్టాడు. ఇసుకపల్లెలో సొంత డాబా ఇల్లుంది' అంటూ పరిచయం చేశాడు పొట్టిగా, నల్లగా బట్టతల వున్న మనిషిని.

అందరికీ మంచినీళ్లిచ్చింది రత్తమ్మ. 'ఏదో సామెత సెప్పినట్లు సల్లకొచ్చి ముంత దాచడం దేనికి? ఈయనకి పది దాకా చదివిన అందాల బొమ్మలాంటి కూతురుంది. అమ్మాయి తల్లిపోలికలే! సిన్మాల్లో జమున అనుకో! పాతికవేలు కట్నం. ఇంకా అబ్బాయికి కాలేజీకి పోవడానికి స్కూటర్... మిగతా పెట్టుపోతలు వుండనే వుంటాయిగా' అంటూ అతని కుటుంబ వివరాలన్నీ చెప్పాడు తుంపులయ్య. చుట్టుపక్కల ఇళ్లలోని ఆడా మగాంతా అక్కడ గుమిగూడి అతను చెప్పేదంతా ఓపిగ్గా ఎదురు ప్రశ్నలు వేయకుండా విన్నారు.

''మన పోతురాజు పెళ్లి చేసుకుంటే కాలేజీ ఫీజులు, హాస్టల్ తిండి తప్పుతుంది. ఏదో సామెత చెప్పినట్లుగా ఒక్క దెబ్బకు రెండు పిట్టలన్నమాట'' నవ్వుతూ ఇంకో సిగరెట్టు వెలిగించాడు తుంపులయ్య.

అక్కడ జేరిన కులపోళ్లందరికీ ఆ సంబంధం అన్ని విధాలా నచ్చేసింది. రాజయ్య మాత్రం పెళ్లయితే అబ్బాయి చదువు దెబ్బతింటుందేమోనని సందేహిస్తుంటే...

''ఆఁ! అవన్నీ పాతకాలంలో... ఇప్పుడు పెళ్లిళ్లు చేసుకొని ఎంతమంది బియ్యేలు, ఎమ్మేలు సదవడం లేదు మామా?'' అంటూ తెలిసిన కొంతమంది గురించి చెప్పాడు రాజయ్య బామ్మర్ది రాములు. పిల్లను చూడ్డం...భోజనాలు చేసి రావడం... మాటామంతీ అయిపోయింది. నెల దాటితే ముహుర్తాలు లేవని నెలలోపే పెళ్లి చేశారు. పెళ్లిలో తుంపులయ్య కనపడలేదు. కట్నం గురించి అడుగుదామంటే ముఖం చాటేశాడు వియ్యంకుడు. పెళ్లి ఖర్చులకిచ్చిన మూడువేలు చాలకపోతే ఇంకో మూడువేలు అప్పు జేయాల్సి వచ్చింది రాజయ్యకి. పెళ్లి హడావుడి తగ్గిన తర్వాత ఇస్తారేమో... పెద్ద మనుషుల వ్యవహారం కదా....పంచాయితీ దాకా ఎందుకులే అని రాజయ్య అనుకున్నాడు. పెళ్లయిన తర్వాత నిద్దర్లకి అటూ ఇటూ తిరిగి కాలేజీ దగ్గరున్న కన్నవారి తోటలో రెండు గదుల ఇల్లు తీసుకొని కాపురం పెట్టాడు పోతురాజు.





## 'దొంగ' నిద్ర

'నిద్రా దేవత నిన్ను వరించె కదరా నిర్భాగ్య దామోదరా' అన్నట్టు ఆ దొంగ దోపిడీ మధ్యలోనే కునుకు తీయబోయి పోలీసులకు చిక్కిపోయాడు. కొలంబియాలో ఒక పెద్ద ఇంటిలో యజమానులు లేని సమయం చూసి ఒక దొంగ తన కార్యం చక్కబెట్టుకొనేందుకు వచ్చాడు. ఇంట్లో విలువైన వస్తువులన్నీ సేకరించి ఒక చోట జాగ్రత్తగా మూట కట్టాడు. అంతవరకూ బాగానే ఉంది. ఆ తర్వాతేమైందో తెలీదు. కట్ చేస్తే... కాస్సేపటికి ఇంటి యజమాని ఇంటికి తిరిగి వచ్చాడు. గదులన్నీ చిందర వందరగా, కొన్ని వస్తువులు మాయమై ఉండడంతో దోపిడీ జరిగిందని నిర్ధారణకు వచ్చాడు. ఏమేం పోయి ఉంటాయో తెలుసుకునే ప్రయత్నంలో తన పడక గది బీరువా తెరిచి చూస్తే... లోపల దొంగ నిక్షేపంగా నిద్దరోతూ కనిపించాడు. యజమాని అతనికి నిద్రాభంగం కలగకుండా జాగ్రత్తగా తలుపు జారవేసి, కిందకెళ్ళి పోలీసులకు ఫోన్ చేసాడు. వాళ్ళొచ్చి, జైల్లో కునుకు కంటిన్యూ చేద్దువు రమ్మంటూ దొంగను తీసుకెళ్ళిపోయారు.

ఆ ఏడాది దీపావళి పండక్కి, కొత్తల్లుడు అత్తగారింటికెళ్తాడేమోననుకుంటే, ఒక్కడే ఇంటి కొచ్చాడు పోతురాజు. కాలేజీ ఫీజు కట్టాలని... లేకపోతే క్లాసులకు రానివ్వరని చెప్పాడు.

''అదేంటిరా? మీ మామే అన్నీ చూసుకుంటా నన్నాడుగా. ఇత్తానన్న కట్నం డబ్బులో మూడువేలు తప్ప మిగిలింది పైసా ఇవ్వలేదు'' అన్నాడు రాజయ్య కోపంగా.

''మా మామ ఏదో కోర్టు ఇబ్బందుల్లో వున్నాడంట. ఈ ఏడాది ఖర్చులు మనం భరిస్తే వచ్చే సంవత్సరం నుంచి అంతా ఆయనే చూసుకుంటా నన్నాడు'' చెప్పాడు పోతురాజు.

రాజయ్యకి ఏమీ పాలుపోలేదు. చేతిలో చిల్లి గవ్వ లేదు. పెళ్లికి తెచ్చిన మూడు వేల బాకీ ఇంకా తీరలేకపోగా దాని మీద వడ్డీ ఇంకా పెరిగిపోతోంది. ఆలోచనల్లో పడ్డాడు. బాడవ పొలం ఒకటే మిగిలింది. ఎవర్నడిగినా పైసా అప్పు పుట్టలేదు. అదే విషయం రత్తమ్మతో చెబితే....'పొలం అమ్మేసెయ్... అబ్బాయి కంటేనా' అంది. పొలాన్ని పంటమీదే కౌతరపు ఆంజనేయులుకి అమ్మేసి డబ్బిచ్చి పంపాడు రాజయ్య.

ఆ తర్వాత పోతురాజు చాలా కాలం పాటు ఇంటికి రాలేదు. పోతురాజు నాలుగవ సంవత్సరం చివర్లో వచ్చి కొడుకు పుట్టాడని రాజయ్య, రత్తమ్మను గుంటూరు తీసుకెళ్లాడు. అక్కడంతా కోడలి తాలూకా బంధువులే! కట్నం గురించి అడుగుదామంటే వియ్యంకుడు కనపడలేదు. రాజయ్య, రత్తమ్మ ఆ సాయంత్రం బండికే తిరిగొచ్చారు. పోతురాజుకి డాక్టరీ కోర్సు అయిపోయింది. హౌస్సర్జన్‌లో వుండగా కూతురు పుట్టిందని తెలిసి బంగారు ఉంగరం చేయించుకొని పోయారు రాజయ్య, రత్తమ్మ. పోతురాజు ఇల్లు మారాడు. కనుక్కోవడం కష్టమైంది. హాస్పిటల్‌కి పోయి అడిగితే బ్రాడీపేటలో వుంటున్నాడని పోతురాజు సావాసగాడొకడు అడ్రస్ చెప్పాడు. పోతురాజు ఇంట్లో లేడు. మనవరాలిని చూసి ఉంగరం తొడిగింది రత్తమ్మ. మంచినీళ్లిచ్చిన వాళ్లు గానీ, కూచోమన్న వాళ్లు గానీ లేరు. కోడలు మంచం మీద నుంచి దిగనేలేదు. ఆ సాయంత్రమే గుంటూరు, రేపల్లె పాసింజర్ రైలెక్కి వచ్చేశారు.

ఊర్లోకి వస్తూనే రెండు డ్రాముల సారా తాగి మరీ వచ్చాడు రాజయ్య. ఇంటి దగ్గర కులపోళ్లంతా గుమిగూడారు. మనవరాలెట్టుందని... మనవడెట్టుం డాడనీ... ఎవరి పోలికనీ.. నీ పోలికా? రత్తమ్మ పోలికా? అని... పోతురాజు ఎట్టా వుండాడని..... అడుగుతుంటే...

రాజయ్య...ఉన్నవీ లేనివి గొప్పలు చెబుతూ అదంతా పాటలాగా పాడుతూ... ఆ రాత్రంతా వాగుతూనే వున్నాడు. పోతురాజు గుంటూరులో కాపురం పెట్టిన తర్వాత ఒక్కసారి కూడా కోడల్ని పిల్లల్ని తీసుకురాలేదేమని చుట్టు పక్కల ఇళ్లల్లో వాళ్లంతా రాజయ్యని అడగడమే! అదే సంగతి పోతురాజుకి ఉత్తరం రాశాడు రాజయ్య.

''పట్నంలో ఉన్నోళ్లకి పల్లెటూర్లలో కష్టం నాన్న'' అంటూ తిరుగు ఉత్తరం రాశాడు పోతురాజు. ఆ తెల్లారి కనగాల ఖాసిం సాయిబుని తీసుకొచ్చి, ఇంటెనక లెట్రిన్ దొడ్డి కట్టించాడు. దాన్ని చుట్టుపక్కల ఇళ్లల్లో ఆడోళ్లంతా వింతగా చూశారు.

''కోడలు పిల్ల వత్తందిగా... పట్నపోళ్లకి మనకులాగా చెంబులు తీసుకొని చెరువు కట్టకెళ్లడం ఇబ్బందిగా... అందుకే'' అందరికీ చెప్పింది రత్తమ్మ.

ఆ ఏడాది దసరా పండక్కి భార్యాపిల్లల్ని తీసుకొచ్చాడు పోతురాజు. టాక్సీలో వచ్చినవాళ్లు గంటసేపు కూడా ఉండలేదు. అన్నం కూడా తినకుండా రేపల్లె వెళ్లిపోయారు. వాళ్ల కోసం వండిన పొట్టేలు మాంసం, నాటుకోడి మాంసం కూరలట్టాగే మిగిలిపోయాయి. ఉన్న గంటసేపయినా.. నట్టింట్లో చెప్పులు వేసుకునే తిరిగింది కోడలు. ఇది అన్నపేల కాదంటే... పకోడీలు చేసింది రత్తమ్మ.

''ఈ రాత్రుండి తెల్లారినాక పోవచ్చులెయ్యా! అమ్మాయికి, నీకు ఇబ్బంది లేకుండా లెట్రిన్ దొడ్డి కూడా కట్టించానయ్యా'' అని రాజయ్య ఎంతగా బతిమిలాడినా వినకుండా ఆరోజే వెళ్లిపోయాడు పోతురాజు.

ఆ తర్వాత పోతురాజు కానీ, ఆయన పెళ్లాం, పిల్లలు కానీ ఊరికి రాలేదు.

ఒకటి రెండు సంవత్సరాలు అక్కడక్కడ పనిచేసిన పోతురాజుకి అమెరికాలో ఉద్యోగం వచ్చింది. ఆరు నెలల తర్వాత భార్యాపిల్లల్ని తీసుకెళ్లిపోయాడు. కొడుకు అమెరికా వెళ్లినప్పుడు రాజయ్య చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. కులపోళ్లందరికీ సారా తాగించాడు. పొటేలు కోసి భోజనాలు పెట్టాడు. కులపోళ్లే కాదు ఊరోళ్లంతా రాజయ్యను ఆకాశానికెత్తేశారు. అమెరికా వెళ్లిన కొత్తల్లో నెలకొక ఉత్తరం రాసేవాడు పోతురాజు. దాన్ని కనిపించిన వారందరికీ చూపించేవాడు. అక్కడి వింతలు విశేషాలన్నీ పూసగుచ్చినట్లు చెప్పేవాడు. చదివిందే మళ్లీ మళ్లీ చదివేవాడు. ఇంకో ఉత్తరం వచ్చేదాకా రాజయ్య పని అదే! ఆ తర్వాత అమెరికా నుంచి ఆరునెలలకొకసారి ఉత్తరం వచ్చింది పోతురాజు నుంచి. చాలా బిజీగా వున్నానని, ఉత్తరాలు రాసే టైం లేదని,,, వచ్చే ఏడాది మిమ్మల్నిద్దర్నీ అమెరికా తీసుకెళ్తానని... పాసుపోర్టుతో సిద్ధంగా వుండమని. ఆ సంగతి ఊర్లోనే కాదు చుట్టుపక్కల ఊర్లల్లో తెలిసినవాళ్లకీ, తెలియని వాళ్లక్కూడా పిలిచి మరీ చెప్పాడు రాజయ్య. కనపడ్డ వాళ్లందరికీ అమెరికా వెళుతున్నానని, అక్కడే వుండిపోతానని, ఈ చాకిరేవు, ఇస్త్రీ పనులు చేయనని చెప్పేశాడు. ఆ రోజంతా తాగి తందనాలాడారు కులపోళ్లంతా. అప్పట్నుంచీ అందరూ ఆయన్ని 'అమెరికా రాజయ్య' అని పిలవసాగారు. రోజులు గడుస్తున్నాయి. ఆ తర్వాత సంవత్సరానిక్కూడా ఒక్క ఉత్తరం రాలేదు.

''ఏం రాజయ్యా! ఎప్పుడు అమెరికా



ప్రయాణం?'' అని ఎవరన్నా అడిగితే పాస్‌పోర్టు పని అవ్వలేదని, అమెరికా నుంచి పేపర్లు రావాలని చెప్పేవాడు రాజయ్య. ఒక రోజు అమెరికా నుంచొక ఉత్తరం వచ్చింది. దాంట్లో రాజయ్య పేర పదివేల చెక్ వచ్చింది. మాచర్ల పెద్దాసు సాయంతో భట్టిప్రోలు బ్యాంకులో అకౌంట్ తీసి దాంట్లో వేశాడా చెక్. మూడు నెలలైనా డబ్బు రాలేదు. రోజూ వెళ్లి డబ్బు వచ్చిందా? లేదా? అని కనుక్కుని వచ్చేవాడు. తర్వాత తెలిసింది ఆ అకౌంట్‌లో డబ్బు లేదని. పనయిపోగానే కరణం గారి దగ్గరకి వెళ్లేవాడు రాజయ్య. దినపత్రిక ఆసాంతం చదివేవాడు. ఇరాక్ మీద అమెరికా యుద్ధం మొదలయ్యింది. యుద్ధ వార్తలు ఒక్కటీ వదలకుండా చదివేవాడు.

రత్తమ్మకి నెలరోజులయినా జ్వరం తగ్గలేదు. డాక్టర్ నల్లాచారి గారి మందులు పనిచేయక గుంటూరు పెద్దాసుపత్రికి పొమ్మన్నాడు. గర్భసంచికి క్యాన్సర్ వచ్చిందనీ.... ఆపరేషన్ చెయ్యాలని చెప్పారు డాక్టర్లు. కొడుకుని ఏ సంగతి కనుక్కుందామని అమెరికాకు ఉత్తరం రాసాడు రాజయ్య. రెండు నెలలు, మూడు నెలలు, ఆరు నెలలయినా జవాబు రాలేదు. రత్తమ్మ జ్వరం తగ్గినట్టే తగ్గి మళ్లీ వస్తోంది. ఏమీ తినడం లేదు. బాగా చిక్కిపోయింది. మళ్లీ గుంటూరు తీసుకెళ్లాడామెని రాజయ్య.

''జబ్బు బాగా ముదిరిపోయింది. ఇప్పుడు ఆపరేషన్ చేయడానికి వీల్లేదు. కరెంటు పెట్టాల్సిందేనని చెప్పారు డాక్టర్లు. రాజయ్యకు భయమేసింది. సలహా అడుగుదామన్నా తెలిసిన డాక్టరు నల్లాచారి తప్ప ఎవ్వరూ లేరు. ఆయనేమో.... ఆ వైద్యం నాకేం తెల్సురా అన్నాడు. కొడుకుని కనుక్కుందామంటే అమెరికాకు రాసిన ఉత్తరానికి ఒక్కదానికి జవాబు రాలేదు. అయినా ఆశ చావక ఇంకో ఉత్తరం రాశాడు పోతురాజుకి. జవాబు కోసం ఎదురు చూడ్డం వృథా అని 'ఏదైతే అదే చెయ్యండి' అని డాక్టర్లకి దండం పెట్టి చెప్పాడు రాజయ్య. నెల రోజుల పాటు రేడియేషన్ పెట్టారు. ఎముకల గూడయిపోయింది. నెత్తి మీద జుట్టంతా ఊడిపోయింది రత్తమ్మకు. అన్ని పనులు రాజయ్యే చెయ్యసాగాడు.

''ఇట్టాంటి జబ్బులకి అమెరికాలోనైతే బ్రెంబాండంగా వైద్యం సెత్తారంట మామా'' అని ఒకరు, ''పోతురాజుకి ఉత్తరం రాయకపోయావా వచ్చి తీసుకెళ్లే వాడని'' ఇంకొందరు..ఎవరికి తోచిన సలహా వాళ్లు చెప్పేవాళ్లు. నవ్వి ఊరుకునేవాడు రాజయ్య.

రాజయ్య చాకిరేవుకి వెళ్లడం మానేశాడు. రేవులో బండను అన్నకొడుకు సోమయ్య తీసుకున్నాడు. ఇస్త్రీ పెట్టె మీదే పావలా, బేడా డబ్బులొచ్చేవి. రత్తమ్మ లేచి తిరగసాగింది. ఇప్పుడు కొంచెం ఓపికొచ్చి చాకిరేవుకి వెళ్లసాగింది. ఇంతకు ముందులాగా పదిళ్ల బట్టలు ఉతకలేక.... రెండు మూడిళ్ల బట్టలు మాత్రమే తెచ్చుకుంటోంది. పోతురాజు అమెరికా వెళ్లిపోయి పుష్కరం దాటిపోయింది. అట్నుంచి ఒక్క ఉత్తరం లేదు. రెండు సంవత్సరాలకొకసారి ఇండియా వచ్చి, అత్తగారింటికెళుతున్నాడు. గానీ సొంత ఊరు రావడం లేదు. అట్నుంచి అటే వెళ్లిపోతున్నాడు. పోతురాజు వచ్చినట్లు ఎవరో చెబితే గానీ తెలిసేది కాదు రాజయ్యకి. ఆడు నా కడుపున పుట్టలేదనేది రత్తమ్మ. రాజయ్య మాత్రం కొడుకు మీద ఈగ వాలనిచ్చే వాడు కాదు.

ఈ మధ్య రాజయ్య పేపరు సరిగ్గా చదవలేకపోతున్నాడు. అద్దాలు పవరు దిగిపోయిందేమోనని రేపల్లెలోని క్రిష్ణమూర్తి డాక్టర్ గార్కి చూపించుకుంటే.... రెండు కళ్లల్లో శుక్లాలొచ్చినాయిరా! శుక్లాలు తీసి లోన మామూలు అద్దం పెడితే ఇంత... ఫారిన్ అద్దం అయితే ఇంత.... అంటూ ఆపరేషన్‌కయ్యే ఖర్చులు చెప్పాడు. తర్వాత చేయించుకుంటానని వచ్చేశాడు రాజయ్య.

ఆ సంవత్సరం దసరా సెలవులప్పుడు భట్టిప్రోలు టిఎంరావు హైస్కూలులో ఉచిత కంటి శస్త్రచికిత్స వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ వాళ్లు ఏర్పాటు చేశారు. ఆ శిబిరంలో కంటి శుక్లాలున్నవారంతా పేర్లు నమోదు చేయించుకోసాగారు. రాజయ్య కూడా వెళ్లాడు.

''నీ పేరు?'' అడిగాడు పేర్లు నమోదు చేసుకుంటున్న వ్యక్తి.

''అమెరికా రాజయ్య'' చెప్పాడు పక్కనే వున్న భట్టిప్రోలు సర్పంచి మామిడి రాజయ్య.

ఒక కంటికి ఆపరేషన్ చేశారు. ఆరునెలల తరువాత రెండో కంటికి చేస్తామన్నారు. ఆపరేషనయిపోయి ఇంటికొచ్చాడు రాజయ్య. చూపు బాగానే వచ్చింది. రోజూ పేపరు చదువుతున్నాడు. అమెరికా గురించేమన్నా వార్తలుంటాయేమోనని పేపరంతా వెతికేవాడు.

ఒకరోజు 'అల్‌ఖైదా వాళ్లు అమెరికాలోని న్యూయార్క్‌లో బిల్డింగ్‌ల మీద విమానంతో దాడి చేయడంతో వేల మంది మృతి... మృతుల్లో ఆంధ్రులు'' అనే వార్త చూసి తల్లడిల్లిపోయాడు. అన్నం తినబుద్ధి కాలేదు. ఆ విషయం రత్తమ్మకి చెప్పలేదు. చెబితే దిగులేసుకుంటుందని.

పరుగు పరుగున రేపల్లె వెళ్లాడు. వియ్యంకుడు లేడు. వియ్యపురాలు వుంది. డాబా ఇల్లు నాలుగంతస్తుల మేడయింది. గోల్డ్‌ఫ్రేం కళ్లజోడుతో, పైనుంచి చూసింది రాజయ్య వంక వీడికిక్కడేం పనన్నట్లు....

''అబ్బాయి, పిల్లలు, కోడలు ఎట్టా ఉన్నారమ్మా? ఆఁ! ఏం లేదూ పేపర్లో ఏదో వార్తలొత్తున్నాయ్‌గా!''

''మా అమ్మాయి, అల్లుడు వుండేది అక్కడ కాదులే ఇల్లినాయిస్‌లో'' అంటూ లోపలికెళ్లి పోయింది ఆమె.

''హమ్మయ్య... ఎక్కడుండా బాగుంటే చాలు'' అనుకుంటూ ఇంటికి తిరిగి వచ్చేశాడు. అప్పుడు చెప్పాడింట్లో పేపర్లో వార్త గురించి, రేపల్లె వెళ్లిన సంగతి. అనవసరంగా వాళ్లింటికెందుకెళ్లావని రచ్చరచ్చ చేసింది రత్తమ్మ. ''ఇంత కాలం ఉత్తరం రాయనోడు, ఫోన్ చేయనోడు! అబ్బా, అమ్మ సచ్చారో, బతికారో అని సూడనోడి కోసమేనా ఇదంతా'' అంటూ కొడుకు, కోడల్ని.... వియ్యపురాల్ని, వియ్యంకుడ్ని తిట్టిపోసింది రత్తమ్మ ఆ రాత్రంతా....

ఆ ఏడాది సంక్రాంతి పండక్కి, అమెరికా నుంచి కొడుకు, కోడలు, పిల్లలు వచ్చారని కనగాల గుప్తా హోటల్లో తుంపులయ్య కనపడి చెప్పాడు

రాజయ్యకు. అట్నుంచటే బస్సెక్కి రేపల్లె వెళ్లిపోయాడు రాజయ్య. మేడకు రంగులేసి రకరకాల కరెంటు బల్బులు పెట్టారు. మేడ ముందు చాలా కార్లు ఆగున్నాయి. జనమంతా ఖరీదైన బట్టల్లో హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. నిలబడి వాళ్ల వంక చూస్తున్నాడు రాజయ్య.

''అలా నిలబడి చూడకపోతే కుర్చీలు సర్దవచ్చుగా'' అంది వియ్యపురాలు.

కుర్చీలన్నీ వరుసగా షామియానా కింద సర్దాడు.

''ఈ పనోళ్లతో ఒకటే ఇబ్బంది వచ్చిపడింది. తిన్న ప్లేట్లన్నీ గుట్టల్లా పడున్నాయి. మన పని మనం చేసుకుంటే తప్పేముంది? కొంచెం ఆ పని చూడు మనింట్లో ఫంక్షనేగా!'' అనేసరికి మారు మాట్లాడకుండా ప్లేట్లు, గ్లాసులన్నీ కడిగాడు రాజయ్య. ఒంట్లో ఓపిక లేక చాకిరేవు పని, ఇస్త్రీ పనులు మానేసి చాలా సంవత్సరాలైంది.

''ఏం ఫంక్షను? మనవరాలి పెళ్లి చూపులా? నిశ్చితార్థమా?'' ఆలోచిస్తూ పక్కన ప్లేట్లు కడుగుతున్నతన్ని అడిగాడు రాజయ్య.

''నాకేం తెలుసయ్యా. నేను కూడా నీలాంటి కూలోన్నే. అదిగో సూటు బూటూ వేసుకొని కుర్చీలో కూసున్నాడు సూడు ఆయనే అమెరికా డాక్టరు. ఆయన పెళ్లాం, పిల్లల్తో అమెరికా నుంచొచ్చాడు. ఆయనగోరు ఒచ్చినప్పుడల్లా వారం రోజుల పాటు మాకందరికీ పనే'' చెప్పాడు.

దూరంగా షామియానా కింద పది మంది సూట్లు, బూట్లు వేసుకొని డాబుగా వున్న ఫ్రెండ్స్‌తో నవ్వుతూ మాట్లాడుతున్న పోతురాజును చూశాడు రాజయ్య. అబ్బాయి ఎంత మారిపోయాడు. బాగా వళ్లు చేసి రంగుతేలాడు. అమెరికా నీళ్లు బాగా పడ్డట్టుండాయి. కోడలు, పిల్లలు కనపడలేదు. పరుగు పరుగున కొడుకు దగ్గరకెళ్లి ''బావున్నావయ్యా... ఎన్నాళ్లయిందయ్యా నిన్ను చూసి. కోడలు, పిల్లలెట్టా వుండారు? అమ్మకు పదేళ్ల కిందట కరెంటు పెట్టారు. నాకు చూపు బాగానే ఆనుతుంది. కుడి కంటికి శుక్లమొస్తే తీసేరు. ఎడం కంటికి ఎండాకాలంలో సేత్తామన్నారు. అమ్మ రోజూ అడుగుతుంది. కోడల్ని, పిల్లల్ని తీసుకొని ఇంటికెప్పుడొత్తావయ్యా? పిల్లలేరి కనపడ్డం లేదు''అని బడబడా మాట్లాడేస్తున్నాడు రాజయ్య.

అనుకోని సంఘటనకు పోతురాజు మొహం పాలిపోయింది. ఖరీదైన మనుషుల మధ్య పంచె, చిరుగుల జుబ్బాతో, కాళ్లకు చెప్పుల్లేకుండా ఉన్న తండ్రి ఎదురుపడేసరికి పరువుపోయినట్టయింది. నోట మాటరాలేదు.

''హూ ఈజ్ హీ?'' అని అడిగారు పక్కనున్న ఫ్రెండ్స్.

''ఆఁ...హీ ఈజ్ మై సర్వెంట్'' అని చెప్పాడు పోతురాజు కంగారు కంగారుగా.

''ఆ! నువ్వు ఇంటికి పద...రేపు నే వస్తానులే'' అని పక్కకి తీసుకెళ్లి చెప్పాడు పోతురాజు రాజయ్యతో.

ఆ రాత్రి రేపల్లె నుంచి తిరిగొస్తూనే తాగొచ్చాడు రాజయ్య. రేపల్లె వెళ్లిన సంగతి ఎవ్వరితోనూ చెప్పలేదు. చివరకి రత్తమ్మతో సహా! ఆరాత్రంతా పాటలు పాడుతూనే వున్నాడు. కులపోళ్లంతా చుట్టూ చేరారు. పోతురాజు పుట్టిన దగ్గర్నుంచి బడిలో, చదువు, డాక్టరు సీటు, పెళ్లి... పిల్లలు... అమెరికా ప్రయాణం... ఆ కథంతా పాటలాగా పాడుతూ చెప్పాడు. పాటలయిపోయేసరికి మలికోడి కూసింది. ఆ పాటల్లో కొడుకు గురించి ఎప్పటిలాగే గొప్పలు ఎక్కువే వున్నాయి. కానీ... గొంతులో విషాదం జీరే ఎక్కువగా వినిపించింది. ఈరోజు రాజయ్యకు ఏమయ్యిందని అందరూ అనుకున్నారు. తాగొచ్చి పాటలు పాడతాడు గాని...మరీ ఇంతగా ఎప్పుడూ పాడలేదు అని కొంతమంది అంటుంటే.... కొడుకు గుర్తుకొచ్చాడేమోననుకున్నారు మరికొందరు.

***

కనగాల మసీదులో సాయిబు అజాతో నిద్ర లేచింది రత్తమ్మ. రాజయ్య పక్క ఖాళీగా వుంది. కట్టకెళ్లాడేమోననుకుంది. బట్టలు తీసుకుని చాకిరేవుకెళ్లింది. పొగమంచు దట్టంగా అల్లుకుంది. అప్పటికే చాకిరేవులో రాగాలు తీస్తూ బట్టలుతుకుతున్నారు కొంతమంది. సంక్రాంతి పండక్కి అంత పొద్దున్నుంచే ఉతికితే గాని పనికాదు. రాజయ్య కోసం... చాకిరేవు బండ దగ్గర చూసింది. లేడు. కంగారుపడింది రత్తమ్మ. బట్టలు ఉడకేసే బాన కింద నిప్పులు కళాపెళా కాలుతున్నాయి. దాని దగ్గరగా కూర్చుని ఇత్తడి ఇస్త్రీపెట్టెను చింతపండుతో తోముతున్నాడు రాజయ్య. మంచుబిందువుల్ని చీల్చుకుంటూ పడుతున్న తూర్పు కిరణాలకు తళుక్కున మెరుస్తోంది చిలుము పోయిన ఇస్త్రీ పెట్టె.

